పేదల జీవితాల్లో ఆనందకాంతులు

- పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి
- కప్పలదొడ్డి, ఆకులమన్నాడుల్లో ప్రజాదీవెన యాత్రలో ఉప్పాల రాము


ప్రజాదీవెన యాత్రలో భాగంగా కప్పలదొడ్డిలో ప్రజలతో మమేకమైన ఉప్పాల రాము

గూడూరు: నేత కార్మికుల జీవితాల్లో ఆనందం నింపిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము అన్నారు. ప్రజాదీవెన యాత్రలో భాగంగా సోమవారం గూడూరు మండలంలోని కప్పలదొడ్డి, ఆకులమన్నాడు గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అవ్వగానే మగ్గం ఉన్న ప్రతి నేత కార్మికుడికి రూ.24 వేల సాయం ప్రకటించారని తెలిపారు. గడప గడపకు తిరుగుతున్నప్పుడు ప్రతి చేనేత కార్మికుడు తమకు నేతన్న నేస్తం ద్వారా లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేశారన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యతోగానీ, అర్హత ఉండి పథకం ద్వారా తమకు లబ్ధి చేకూరలేదని ఏ ఒక్కరూ తన దృష్టికి తీసుకురాలేదంటే గ్రామ సచివాలయాలతో జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంత పకడ్బందీగా అమలయ్యాయో అర్థం చేసుకోవాలన్నారు. గతంలో ఏదైనా పథకం ద్వారా లబ్ధి పొందాలంటే కార్యాలయాల చుట్టూ, జన్మభూమి కమిటీ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. గ్రామ వలంటీర్లతో అర్హులకు నేరుగా ఇంటి ముంగిటకే పథకాలు అందించామని చెప్పారు.

నివేశన స్థలాల సమస్య పరిష్కారం

కప్పలదొడ్డిలో రెండు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న నివేశన స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామన్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీలో దాదాపు 200 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి గృహనిర్మాణ రుణాలు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే కాలనీలో 100 మంది ఇళ్లు కట్టుకుని గృహప్రవేశాలు పూర్తి చేయడం సంతోషకరమన్నారు. కాలనీలో అంతర్గత రహదారులు, విద్యుత్, నీటి సరఫరాకు కృషి చేస్తానని రాము హామీ ఇచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో గ్రామంలో దాదాపు 60 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం, 62 లక్షలు జల్ జీవన్ మిషన్ నిధులతో తాగునీటి సరఫరా మెరుగుపర్చడానికి చర్యలు తీసుకున్నామన్నారు. తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం పూర్తికాగా కుళాయిలు బిగిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తానని రాము హామీ ఇచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్‌రంగబాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్ నాయుడు, మాజీ జెడ్పీటీసీ బూరగడ్డ శ్రీకుమార్, పార్టీ నాయకులు పర్లం పెదబాబు, మోటేపల్లి రత్నారావు, గొరిపర్తి రవికుమార్, సర్పంచి యక్కల మాధవి, ఎంపిటీసీ పేరిశెట్టి తేజోవతి, తదితరులు పాల్గొన్నారు.

త్యాగ నిరతికి ప్రతీక రంజాన్


అవనిగడ్డలో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సింహాద్రి, రామ్‌చరణ్

అవనిగడ్డ: త్యాగ నిరతికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ తనయుడు రామ్‌చరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి, రామ్‌చరణ్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో కలిసి ఇఫ్తార్ విందు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్‌నజీర్‌బాషాతో పాటు పలువురు ముస్లిం పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో ప్రశాంతంగా ఎన్నికలు

అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్

ఘంటసాల: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరగడానికి ప్రజలంతా సహకరించాలని అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ అన్నారు. ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, కొడాలి, దేవరకోట, ఘంటసాల గ్రామాల్లో కేంద్ర బలగాలతో సోమవారం సాయంత్రం డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ (కవాతు) నిర్వహించారు. కార్యక్రమంలో చల్లపల్లి సీఐ చిన్ని నాగప్రసాద్, ఘంటసాల, చల్లపల్లి ఎస్ఐలు కె.ప్రతాప్ రెడ్డి, సీహెచ్.చినబాబు, సెంట్రల్ ప్యారామిలటరీ ఫోర్స్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీస్ కుటుంబాలకు ఉగాది శుభాకాంక్షలు

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా ప్రజలతో పాటు పోలీస్ కుటుంబాలకు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంవత్సరాదిలో జిల్లా ప్రజలకు అన్నీ శుభాలు జరగాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సిరిసంపదలతో ప్రశాంత జీవనం గడపాలని కోరుకున్నారు. ఉగాది పండుగను బంధుమిత్రులతో సంప్రదాయబద్ధంగా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. విఘ్నాలు లేకుండా పనులు జరగాలని పేర్కొన్నారు.

బందరులో ఇఫ్తార్ విందు



మచిలీపట్నంటౌన్: నగరంలోని శారదానగర్ మసీదులో సోమవారం జరిగిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షను విరమించిన తర్వాత ప్రతి రోజూ స్వీకరించే ఇఫ్తార్ విందులో భాగంగా శారదానగర్ మసీదు కమిటీ ఆహ్వానం మేరకు పేర్ని కిట్టు వెళ్లారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నాయకులు షేక్ మొహమ్మద్‌సాహెబ్, బాషు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న వెంటే ఉందాం



కె. కొత్తపాలెం(మోపిదేవి): జగనన్న వెంటే ఉంటూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తనయుడు యువనేత సింహాద్రి వికాస్ బాబు, కుమార్తె నిశ్చల కోరారు. మండల పరిధిలోని కె. కొత్తపాలెంలో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి జగనన్న అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబునాయుడు మాయ మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని కోరారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరావు, మండల పార్టీ కన్వీనర్ గరికపాటి వెంకటేశ్వరావు, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుటారం కృష్ణ, అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి, దుట్టా అశ్వినీ కుమార్, మాజీ సర్పంచ్ పొలిమెట్ల వెంకటేశ్వరావు, మత్తి రాంప్రసాద్, జంపాన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీటీడీ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

మచిలీపట్నంటౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కృష్ణా జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ మంగళవారం ఉగాది పండుగను నగరంలోని చిలకలపూడి విజయ సీతారామస్వామి మందిరంలో నిర్వహిస్తున్నట్లు పరిషత్ ప్రతినిధి తురగ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం జరుగుతుందని పేర్కొన్నారు. 10 నుంచి 16వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 6గంటలకు ఆలయ ప్రాంగణంలో వివిధ అంశాలపై ప్రముఖులతో ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

డిపాజిట్ చేస్తానని నమ్మించి రూ.50 వేలు చోరీ

అవనిగడ్డ: బ్యాంకులో డిపాజిట్ చేస్తానని నమ్మించిన ఓ అగంతకుడు రూ.50 వేలు చోరీ చేసిన ఘటన సోమవారం జరిగింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం అవనిగడ్డకు చెందిన వాకా కృష్ణకుమారి తన మనుమరాలితో రూ.50వేలు డిపాజిట్ చేసేందుకు స్థానిక ఎస్‌బీఐ బ్యాంకుకు వచ్చారు. ఇది గమనించిన ఓ అగంతకుడు డిపాజిట్ చేస్తానని నమ్మించి క్యూలో నిలుచుని అక్కడ నుంచి కనపడకుండా చల్లగా జారుకున్నాడు. దీంతో కృష్ణకుమారి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రేపటి నుంచి అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

పమిడిముక్కల: గుర్రాల్లంకలో టీటీడీ, భక్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ పద్మాల అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం శ్రీ గణపతిపూజ, అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన, క్షీరాధివాసం, హోమం, సాయంత్రం అగ్నిధ్యానం, నవగ్రహాల మంత్ర హోమం, గురువారం గణపతిహోమం, జలాధివాసం, సాయంత్రం గ్రామోత్సవం, అగ్నిధ్యానం, మహాశాంతిహోమం, శుక్రవారం ఉదయం పద్మాల అంకమ్మ తల్లి, గణపతి, పోతురాజుసాముల విగ్రహ ప్రతిష్ట జరుగుతాయని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీకి మళ్లీ మద్దతివ్వండి

వైఎస్సార్ సీపీ బందరు అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు


మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీకి మద్దతిచ్చి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 6వ డివిజన్‌లో సోమవారం ఆయన ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేర్ని కిట్టు, వైఎస్సార సీపీ నాయకులకు ఆ డివిజన్‌లోని ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. డివిజన్‌లోని జెడ్పీ సెంటర్, కొబ్బరితోట, సిద్ధార్థ స్కూల్ ప్రాంతాల్లో పేర్ని కిట్టు పర్యటించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ ఇంటింటి ప్రచారానికి వెళ్తున్నప్పుడు ప్రజలు ఎదురొచ్చి మా ఓట్లన్నీ మీకేనంటూ బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గత టీడీపీ పాలన.. నేటి సీఎం జగనన్న పాలనను ప్రజలు చూసి ఏ ప్రభుత్వం వస్తే బాగుంటుందో ఇప్పటికే బేరీజు వేసుకున్నారన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో వచ్చిన పెనుమార్పులను ప్రజలు గమనించారని చెప్పారు. రూ. 5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచటంతో ఎంతటి పెద్ద వ్యాధులకైనా కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదలు చికిత్స పొందుతున్నారన్నారు. మచిలీపట్నంలో పోర్టు, ఫిషింగ్ హార్బర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభమైందని వివరించారు. మునుపెన్నడూ లేని విధంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో నేరుగా ఎదుర్కోలేక చంద్రబాబునాయుడు పొత్తులకు తెర లేపారన్నారు. పొత్తుల్లో భాగంగా చంద్రబాబుతో పాటు పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకులు మోసపూరిత వాగ్దానాలు, ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు పల్లపోతు అంకబాబు, ఉపాధ్యక్షుడు మట్టా రామదాసు పేర్ని కిట్టుకు, పార్టీ కార్యకర్తలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ముద్రించిన కరదీపిక పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పర్లం సతీష్, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్లు ఏకశిరి వెంకటేశ్వరరావు, రాసంశెట్టి వాణిశ్రీ, మేకల సుబ్బన్న, పల్లి శేఖర్, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎగ్గోని గాంధీ, మాజీ సర్పంచ్ వాలిశెట్టి రవిశంకర్, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, మరీదు నాగరాజు, బడే భాను తేజ, బూరగ రామారావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నూటికి నూరు శాతం గడప గడపకూ సంక్షేమ ఫలాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కిందని ఆ పార్టీ బందరు అభ్యర్థి పేర్ని కిట్టు అన్నారు. చిట్టి పాలెం గ్రామంలో సోమవారం గడప గడపకు సంక్షేమం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అర్హులకు వాటిని చేరువ చేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆయన్ని బలపరచి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జి చండిక అజయ్ కుమార్, బుద్రపోతుపాలెం మాజీ సర్పంచి నట్టే ప్రసాద్, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టాల్లో వెన్నంటి ఉన్న వారిని మరిచిపోను

వైఎస్సార్ సీపీ పెడన అభ్యర్థి ఉప్పాల రాము


కాపు సామాజిక వర్గ ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు

పెడన: కష్టాల్లో వెన్నంటే నిలిచి మద్దతుగా నిలిచిన వారిని ఎప్పటికీ మరచిపోనని, అటువంటి వారిని గుండెల్లో పెట్టుకుంటానని వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. బంటుమిల్లి రోడ్డులోని ఫంక్షన్ హాలులో పెడన నియోజకవర్గంలోని కాపు సామాజిక వర్గం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత మచిలీపట్నం లోక్‌సభ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు హాజరై నియోజకవర్గంలోని నాయకులను కలిశారు. అనంతరం రాము సభకు హాజరై మాట్లాడారు. కులమతాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని, తనకు కూడా కులమతాలతో సంబంధం లేదని, మానవత్వమే నా కులం అంటూ స్పష్టం చేశారు. రెండు ఓట్లను కూడా ఫ్యాను గుర్తుకు వేసేలా అందరిని ప్రోత్సహించాలని తెలిపారు. తొలుత ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు మాట్లాడుతూ తాను సేవ చేయడానికి మాత్రమే రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. పలువురు మాట్లాడుతూ సేవా గుణం కలిగిన వైద్యనిపుణుడు మన ఎంపీ అభ్యర్థిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉప్పాల రమేష్(రాము)ను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు. దక్షిణ మధ్య రైల్వే బోర్డు అధ్యక్షుడు మోటేపల్లి రత్నారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, పెనుమలూరు నియోజకవర్గ పరిశీలకులు యడ్లపల్లి రామ్‌సుధీర్, పార్టీ నాయకులు జక్కా ధర్మరాయుడు, కొండవీటి నాగబాబు, గరికిపాటి వెంకటరామానాయుడు, మలిశెట్టి వెంకటరమణ, సంగా మధుసూదనరావు, సుజ్ఞానం మహేష్, జన్యావుల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పీఏసీఎస్ సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న పీఏసీఎస్ సభ్యులు


మాజేరు(చల్లపల్లి): రైతు కుటుంబానికి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. చల్లపల్లి మండలం మాజేరు గ్రామానికి చెందిన పీఏసీఎస్ సభ్య రైతు ఆరేపల్లి చిన కోటేశ్వరరావు (80) మరణించారు. ఆయన మట్టి ఖర్చుల నిమిత్తం సంఘ సభ్యుల సంక్షేమ నిధి నుంచి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ అరజా శివశంకర్ ఈ సాయాన్ని కోటేశ్వరరావు కుమారుడికి అందజేశారు. కార్యక్రమంలో పర్సన్లు మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లి కోటేశ్వరరావు, సీఈఓ ఎస్ ఎస్ చక్రపాణి పాల్గొన్నారు.

కార్నియా సేకరణ

గుడివాడ టౌన్: కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కార్నియా(ఐబాల్స్) సేకరించారు. స్థానిక 11వ వార్డుకు చెందిన గొట్టిపాటి విజయ్‌బాబు మృతి అనంతరం కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియా సేకరించినట్లు తెలిపారు. సేకరించిన కార్నియాను విజయవాడకు చెందిన అగర్వాల్ కంటి ఆస్పత్రికి తరలించినట్లు సీతయ్య పేర్కొన్నారు.

గంగాభవాని జాతరకు ఏర్పాట్లు పూర్తి

నేడు పశువుల జాతర, రేపు ప్రధాన గుడిసంబరం


గంగాభవానీ అమ్మవారు

కోడూరు: భక్తుల కొంగుబంగారం కోడూరు గంగాభవానీ అమ్మవారి ప్రధాన జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలతో జాతరను ప్రారంభించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు సోమవారం తెలిపారు. తొలిరోజు రైతులు తమ పశువులను ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పశువుల జాతర అనంతరం పోతురాజు సంబరం ఉంటుందన్నారు. బుధవారం ఉదయం అమ్మవారికి మహిళలతో నైవేద్యాల సమర్పణ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రికి ప్రధాన గుడిజాతర ఉంటుందని, భక్తుల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు యుగంధరరావు చెప్పారు. జాతరను పురస్కరించుకొని ఆలయాన్ని నూతన రంగులతో తీర్చిదిద్ది, విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు ఎటు చూసినా విద్యుత్ అలంకరణతో దేవతామూర్తుల చిత్రపటాలే దర్శనమిస్తున్నాయి. భక్తులకు అవసరమైన క్యూలైన్లను సిద్ధం చేశారు. ఇప్పటికే అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభమైంది. ప్రస్తుతం నరసింహపురంలో గ్రామోత్సవం కొనసాగుతోంది.

నేడు కాశీవిశ్వేశ్వరుడి సన్నిధిలో ఉగాది వేడుకలు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం క్రోధి నామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు సోమవారం తెలిపారు. ఉగాది వేడుకకు పెదకళ్ళేపల్లి ఓంకార పీఠాధిపతి శ్రీవిజయానందగిరి స్వామీజి భక్తులకు అభిభాషణం చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఘనంగా వీరభద్రుడి కల్యాణం


వీరభద్రుడి కల్యాణోత్సవం

పెడన: పట్టణంలోని బ్రహ్మపురంలో వేంచేసి ఉన్న శ్రీభద్రావతి సమేత వీరభద్రస్వామి కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. కర్ణోద్భవ సామాజిక వర్గం ఆరాధ్యదైవమైన వీరభద్రుని కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బొప్పే కృష్ణమోహన్, శైలజ దంపతులతో పూజారులు కల్యాణం చేయించారు. ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. తిరిగి బ్రహ్మపురం చేరిన తర్వాత అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిప్పుల గుండాన్ని తొక్కుతూ మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివార్లను పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము), జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణానంతరం భారీ అన్న సమారాధన చేశారు. పెడనలో చేనేత, కలంకారి పరిశ్రమలకు సెలవు ప్రకటించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నింపే పనులు ప్రారంభం


తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులోకి నీటిని తోడుతున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగర ప్రజల దాహార్తి తీర్చే తరకటూరులోని 200 ఎకరాల సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటిని నింపే పనులు సోమవారం రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యాయి. ఈస్ట్ రైవస్ కాలువ ద్వారా నీరు చెరువు వద్దకు చేరటంతో నగరపాలకసంస్థ తోడే పనులు ప్రారంభించింది. వీటిని ఏఈ సాయిప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు. ఐదారు రోజుల్లో చెరువును పూర్తిస్థాయిలో నింపడానికి చర్యలు తీసుకున్నామని కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు 'సాక్షి'కి తెలిపారు. ప్రస్తుతం 655 హెచ్‌పీ ఎలక్ట్రికల్ మోటర్లు, 800 హెచ్‌పీ ఆయిల్ ఇంజన్లతో నీటిని తోడుతున్నాయన్నారు. మరో 600 హెచ్‌పీ ఇంజిన్ల ద్వారా మంగళవారం నుంచి నీటిని తోడే పనులు ప్రారంభిస్తామన్నారు. చెరువును పూర్తిస్థాయిలో నీటితో నింపితే 60 రోజుల పాటు నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపులో చేతివాటం

- ఆ పార్టీ జిల్లా, రాష్ట్ర ముఖ్య నేతల కీలకపాత్ర
- రూ.5 లక్షలు అడిగితే 50 వేలు ఇచ్చా..
- బందరు సీటు కోసం ప్రయత్నించి భంగపడ్డ కోన నాగార్జున ఆరోపణ

మచిలీపట్నం టౌన్: కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపులో నాయకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని కృష్ణా జిల్లా మచిలీపట్నం అసెంబ్లీ సీటు ఆశించి భంగపడ్డ ఆ పార్టీ నేత కోన నాగార్జున ఆరోపించారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. మచిలీపట్నం సీటు కోసం తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నామన్నారు. రాహుల్‌గాంధీ చెప్పిన విధంగా యువతకు 33 శాతం సీట్లు అన్నట్లుగా తనకు సీటు వస్తుందని ఆశించానన్నారు. పార్టీలోని పెద్దల మ్యాచ్ ఫిక్సింగ్‌తో వేరే వ్యక్తికి సీటు ఇచ్చారన్నారు. జిల్లా, రాష్ట్ర కీలక నాయకులు ఎన్నికల ఫండ్‌లో 50-50 పంథాను అనుసరించి సీట్లను కేటాయించారన్నారు. తాను పార్టీలో చేరే సమయంలోనే జిల్లా కీలకనేత ఈ విషయాన్ని తనకు చెప్పారన్నారు. పార్టీలో చేరడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని దీనిలో భాగంగా చేరే రోజున జిల్లా కీలక నేతకు రూ.50 వేలు ముట్టజెప్పానని దీనికి సంబంధించి ఫోన్ కాల్ రికార్డ్, ఇతర ఆధారాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. 10వ తేదీన సీటు ఇచ్చే విషయమై పునరాలోచన చేస్తామని పీసీసీ చీఫ్ షర్మిల తనకు చెప్పారని తనకు సీటు రాకుంటే షర్మిల బొమ్మతో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ఆయన పేర్కొన్నారు.